క్లుప్తంగా

వాహనాల తనిఖీలు

పెదకాకాని: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 40 మందికి సోమవారం అపరాధ రుసుం విధించినట్లు సీఐ టి.పి.నారాయణ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పెదకాకానిలో వాహనాల తనిఖీలు నిర్వహించామని, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న 40 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు అపరాధ రుసుం విధించామని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడ్, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కూలీ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం చిమట పంచాయతీ ఓగిరాలవారిపాలేనికి చెందిన కటారి రమణయ్య గ్రానైట్ లోడింగ్, అన్‌లోడింగ్ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి ఏలూరులో గ్రానైట్ అన్‌లోడింగ్ చేసేందుకు బయల్దేరివెళ్లాడు. ఏలూరులో అన్‌లోడింగ్ అనంతరం 2వ తేదీన లారీలో కొబ్బరికాయలు లోడు చేసుకుని ఏలూరు నుంచి తిరిగి స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం 16వ నంబరు జాతీయ రహదారిపై లారీ డ్రైవరు గుడిపాటి రంగనాయకులు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వాహనం అదుపుకాకపోవడంతో హైవే డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పక్కనే కూర్చున్న రమణయ్య తీవ్ర గాయాలపాలవ్వడంతో స్థానికులు అంబులెన్స్‌లో గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రమణయ్య కుమారుడు కటారి ప్రసాద్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.నాగేంద్ర తెలిపారు.

ఈ నెల కూడా కందిపప్పు లేనట్లేనా..

పొన్నూరు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు సరఫరాపై మార్చి నెలకు సంబంధించి కూడా కూటమి ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయకుండా చేతులెత్తేసింది. కేవలం బియ్యం, పంచదార మాత్రమే కార్డుదారులకు అందిస్తూ చేతులు దులుపుకుంది. రంజాన్ మాసంలో గోధుమలు అందించాల్సి ఉండగా పట్టించుకోకుండా బియ్యం, పంచదారకే పరిమితం చేసింది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సరుకులు ఏ నెల ఏవి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. జనవరి నెలలో పొన్నూరు మండలానికి సంబంధించి 60 శాతం మాత్రమే కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేసినా, మార్చి నెల వచ్చేసరికి కందిపప్పు పంపిణీకి పూర్తిగా ఎగనామం పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని కార్డుదారులు వాపోతున్నారు.

మసీదుల వద్ద శుభ్రత పాటించాలి



పొన్నూరు: రంజాన్ మాసం పురస్కరించుకుని పట్టణ పరిధిలోని అన్ని మసీదుల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డులలో మసీదుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను ఆయన పరిశీలించారు. వెంటనే మసీదుల వద్ద మట్టి దిబ్బలను, చెత్తను తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూజలు చేస్తే రూ.కోట్లు వస్తాయని మోసం

లక్ష్మీపురం: పూజలు చేయడం వల్ల కోట్లాది రూపాయలు వస్తాయని నమ్మబలికి రూ.15 లక్షలు వరకు నగదు తీసుకుని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ప్రకారం రాజేశ్వర కాలనీ 2వ లైన్ ప్రాంతానికి చెందిన మన్నెం నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడిగా చేసి రిటైర్ట్ అయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన భారతి అనే మహిళతో పరిచయం అయింది. భారతి నరసరావుపేటకు చెందిన బొమ్మలబోయిన వెంకాయమ్మ అలియాస్ నాగమణి అమ్మ అనే పేరు గల మహిళను పరిచయం చేసింది. నాగమణి అమ్మ వద్ద మణి ఉందని, పూజలు చేయడం వలన రూ.100 కోట్లు వస్తాయని చెప్పి నాగేశ్వరరావును నమ్మబలికారు. దీంతో 2024 మే 16వ తేదీ నుంచి పలు మార్లు నాగమణిఅమ్మ అనే మహిళ గుంటూరు రాజేశ్వరకాలనీకి వచ్చి పూజలు చేయాలంటూ విడతల వారీగా సుమారు రూ.15 లక్షల వరకు నగదు తీసుకుంది. నగదు తీసుకున్న నాగమణిని బాధితుడు నిలదీయడంతో మోసం చేశారని తెలుసుకున్నాడు. దీంతో దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుడే మొదలైన సూర్య ప్రతాపం

- విలవిల్లాడుతున్న వ్యవసాయ కూలీలు
- క్రమంగా పెరుగుతున్న విద్యుత్ వాడకం



మండే ఎండలో మిర్చి కల్లాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు

ప్రత్తిపాడు: ఎండలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శివరాత్రి వెళ్లి కొన్ని రోజులు కూడా గడవలేదు. ప్రత్తిపాడు మండలంలో శనివారం, ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు దాటిపోయాయి. అంతేకాకుండా గత కొద్దిరోజులుగా ఉన్న రాత్రి పూట ఉన్న చలి తీవ్రత కాస్తంత తగ్గినప్పటికీ, కొత్తగా ఉక్కపోత ప్రారంభమైంది.

ఎండలు ముదరుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వాడకం కూడా క్రమంగా పెరుగుతోంది. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు గిర్రున తిరుగుతున్నాయి.

పరీక్షల సీజన్‌లో విద్యార్థులపై వేసవి ప్రభావం

ఇది పరీక్షా కాలం. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. ఇదే నెలలో పదో తరగతి పరీక్షలు కూడా జరగనున్నాయి. ఇదే సమయంలో ఎండలూ రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యాయులు, వైద్యులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ప్రతి రోజూ ప్రత్తిపాడు నుంచి పెదనందిపాడుకు ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సి ఉంది. ఉదయం పరీక్షలకు వెళ్లే సమయంలో ఎండ ప్రభావం అంతగా ఉండనప్పటికీ మధ్యాహ్నం తిరిగి వచ్చే సమయంలో మాత్రం ఎండ తీవ్రత అధికంగా ఉంది.

పొద్దంతా ఎండలోనే మగ్గుతున్న కూలీలు..

ప్రస్తుతం మిర్చి కోతలు సాగుతున్నాయి. పొలాల్లో కోసిన మిర్చిని కల్లాల్లో ఆరబోస్తున్నారు. అందులో నుంచి తాలుకాయలు ఏరేందుకు కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎర్రటి ఎండలో కల్లాల్లోనే మగ్గిపోతున్నారు. కాగా ఉదయాన్నే మిర్చి కోతలకు వెళ్లి మధ్యాహ్నానికి ఇంటికి వచ్చే సమయంలో ట్రాక్టర్లు, ఆటోల్లో కూర్చోలేక తలకు రక్షణగా మెత్తని దుస్తులు, టవల్స్ ధరిస్తున్నారు.

డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా జాగ్రత్తలు



విద్యార్థులు, వలస కూలీలు, ప్రజలు ఎండలో బయటకు వెళ్లిన సమయంలో డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా నీరు తాగడం, నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకుంటే డీ హైడ్రేషన్ బారిన పడకుండా ఉండవచ్చు. తెలుపు రంగు, పలుచటి దుస్తులు, టోపీ ధరించడం మంచింది. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి.

– డాక్టర్ మేరి యునిస్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, గొట్టిపాడు

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

వీసీ ఆచార్య గంగాధరరావు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: విజ్ఞాన శాస్త్రాలన్నిటికీ మూల శాస్త్రం రసాయన శాస్త్రం అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని రసాయన శాస్త్ర విభాగంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వర్తమాన కాలంలో మానవ వైద్యం నిమిత్తం ప్రయోగిస్తున్న పలు రకాల మందులు, టీకాలు, ఔషధీకరణలో రసాయన శాస్త్రమే కీలక పాత్ర వహిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో పురుగుమందుల తయారీలో, ఎరువుల తయారీలో రసాయన శాస్త్రాన్ని అనుసరించే వాటి తయారీ జరుగుతుందని రసాయన శాస్త్ర ఆవశ్యకతను వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైన మేరకు తగ్గించాలని సూచించారు. కీలక ఉపన్యాసకులుగా పాల్గొన్న టాంజానియాలోని దోడామ యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎస్‌బీ నంబూరి రసాయన శాస్త్రం మానవ జీవన విధానంలో ఎలా సమ్మిళితం అయిందో వివరించారు. గ్రీన్ కెమిస్ట్రీ ఆవశ్యకతను సోదాహరణంగా తెలిపారు. ఆచార్య ఎం.సుబ్బారావు సంచాలకులుగా నిర్వహించిన సదస్సులో ఆచార్య దిట్ట కవి రామచంద్రన్ అధ్యక్షత వహించారు. సదస్సులో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ జి.సింహాచలం, వర్సిటీ ఓఎస్‌డీ రవికుమార్, సైన్స్ కళాశాల ప్రాచార్యులు కే వీరయ్య, దూరవిద్య కేంద్ర సంచాలకులు వి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎం.త్రిమూర్తి రావు, ఆచార్య ఆర్ శ్రీనివాస రావు, సత్యనారాయణ, ఆచార్య పి.,పద్మావతి, సీఎస్ఆర్ ప్రోగ్రామర్ వెంకటరమణ పాల్గొన్నారు.

బాలికలను తప్పనిసరిగా చదివించాలి



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు తప్పనిసరిగా బాలికలను చదివించాలని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా ప్రత్తిపాడు సెక్టార్‌లోని ప్రత్తిపాడు కుమ్మరిపాలెం అంగన్‌వాడీ కేంద్రం, గొట్టిపాడు సెక్టార్‌లోని వెంకటేశ్వరనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, తల్లులతో బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఆయా సెక్టార్‌ల సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు ఎదురవుతాయని చెప్పారు. బాల్యవివాహం చేసుకున్నా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రతి ఒక్కరం ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకాయమ్మ, కుసుమ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన అన్విత



విద్యార్థిని అన్వితను అభినందిస్తున్న ప్రముఖులు

పెదకాకాని: జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో పెదకాకానికి చెందిన విద్యార్థిని ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ పెద్ది శ్రీనివాస రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు గ్రామంలో శ్రీ అనితా పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని బి.అన్విత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా అన్వితను అప్సస్మా స్టేట్ ప్రెసిడెంట్ తులసి విష్ణు ప్రసాద్, ప్రముఖులు జయప్రకాష్ నారాయణ అభినందించారని పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేదవతి పాల్గొన్నారు.

నగరంపై డ్రోన్ కెమెరాలతో నిఘా

- వేగంగా వెళ్లే వాహనాల నంబర్ ప్లేట్ల గుర్తింపు
- ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే డ్రోన్ కెమెరాల దృశ్యాలతో జరిమానా
- ముగ్గురు ప్రయాణించినా, రేస్ పోటీలు నిర్వహించిన వాహనాలు జప్తు



డ్రోన్ కెమెరా పనితీరుని పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్

నగరంపాలెం: ఇక నుంచి గుంటూరు నగర పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించనున్నట్లు తూర్పు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్(పీఎస్) సీఐ ఎ.అశోక్ తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తూర్పు ట్రాఫిక్ పీఎస్, లాలాపేట పీఎస్ పరిధిలోని ఎంటీబీ సెంటర్, హిమని సెంటర్, పల్నాడు బస్టాండ్, ఎత్తురోడ్డు, పూలకొట్ల బజారు, నల్లచెరువు ప్రధాన రహదారి, దర్గా ప్రాంతాల్లో డ్రోన్ గస్తీని సోమవారం రాత్రి చేపట్టారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల కదలికలు, నిలుపుదల చేసే ప్రదేశాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ మాట్లాడుతూ అధునాతమైన సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా వచ్చే, పోయే వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించే డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తామని చెప్పారు. అతివేగం, ప్రమాదకరంగా వాహనాలు నడిపే చోదకులు, ముగ్గురు ప్రయాణించడం, రేసింగ్ పోటీలను కట్టడి చేసేందుకు దోహదపడుతుందని అన్నారు. డ్రోన్ కెమెరాల్లోని దృశ్యాల ఆధారంగా కేసులు నమోదు చేసి వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు ఆటోలను ఇష్టానుసారంగా నిలుపుదల చేసిన చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా కేటాయించిన స్థలాల్లో ఆటోలను నిలుపుదల చేయాలని అన్నా. వ్యాపార సముదాయాలు, దుకాణదారులు సైతం నిలుపుదల ప్రదేశాలను అధికారుల నుంచి కేటాయించుకోవాలని సూచించారు.

ఊబకాయంపై అవగాహన సదస్సు నేడు

గుంటూరు మెడికల్: ప్రపంచ ఊబకాయ(ఒబెసిటీ) దినోత్సవం సందర్భంగా స్థానిక కొత్తపేట భగత్ సింగ్ సెంటర్ పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో మంగళవారం అధికబరువుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ అధినేత, ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఉచిత అవగాహన కార్యక్రమంతో పాటు బాగా లావుగా ఉండే వ్యక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



కాకుమాను: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రం కాకుమానులోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఏడీఏ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి షాపులో ఎరువులు, పురుగు మందులకు సంబంధించి లైసెన్సులు, ఫాంలు, ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలని ఆమె తెలిపారు. బిల్లులపై రైతుల సంతకాలను తీసుకోవాలని నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే అటువంటి షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఓ కె.కిరణ్మయి ఉన్నారు.

పీఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

చేబ్రోలు: చేబ్రోలు మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ మండలశాఖ అధ్యక్షుడుగా జి.శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడుగా జి.శ్రీనివాసరావు(సుద్దపల్లి పీఎస్), ప్రధాన కార్యదర్శిగా బి.ప్రశాంతి(శేకూరు పీఎస్)తో మరి కొంతమందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ సూచనల మేరకు జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం సంఘ సభ్యులు కలిసి కృషి చేయనున్నట్లు తెలిపారు.

సావిత్రీబాయి పూలే గ్రంథావిష్కరణ



పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో కవి డాక్టర్ కత్తి పద్మారావు తల్లి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండే నాగేశ్వరరావు, దేవరపల్లి రవికుమార్, మాతంగి పెద్దబ్బాయి, కర్ర అంబేడ్కర్ పాల్గొని కత్తి పద్మారావు రచించిన సావిత్రీబాయి పూలే గ్రంథాన్ని ఆవిష్కరించారు. సావిత్రీబాయి పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శనీయమైందని పద్మారావు అన్నారు. మండే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో ఒక ఉద్యమాన్ని ఒకే స్ఫూర్తి, దీక్షతో పోరాటం నడిపిన గొప్ప వ్యక్తులు మహాత్మా పూలే, సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సావిత్రీబాయి పూలే గ్రంథావిష్కరణ సదస్సు జరుగుతుందని పద్మారావు తెలిపారు. కార్యక్రమంలో గేరా ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

వైభవంగా గౌరీశంకర స్వామి కల్యాణ మహోత్సవం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. బాలపూజ యాగశాలలో నిత్య జత హోమాలు, దేవాలయంలో గంగా గౌరీ సమేత గౌరీశంకర స్వామికి మహన్యాస ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. అనంతరం గంగా గౌరీ సమేత గౌరీశంకర స్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని సామూహికంగా చేపట్టారు. ఎన్వీ రమణమూర్తి భాగవతార్ (బొబ్బిలి) ఆధ్వర్యంలో మహాభారతం నుంచి శ్రీకృష్ణరాయబారం హరికథా గానం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక(మెయిన్) పాఠశాలను సోమవారం ఎంఈఓ వార్షిక తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి నవోదయ వంటి పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేసిన ప్రతి ఉపాధ్యాయుడిని అభినందించారు. మండలంలో ఏ పాఠశాలలో లేని విధంగా 105 విద్యార్థులను చేర్పించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవి, ఈవూరి శ్రీనివాసరావు, ఎస్.కోటేశ్వరరావు, సంధ్యారాణి, జ్యోతి, సీఆర్పీలు జమాయమ్మ, సురేంద్ర, చలపతి పాల్గొన్నారు.

విజ్ఞాన్ అధ్యాపకురాలికి డాక్టరేట్



డాక్టర్ శశికళను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

గుంటూరు రూరల్: విజ్ఞాన్ నిరుల అధ్యాపకురాలికి విజ్ఞాన్ డీమ్డ్ టూ బి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని నిరుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న వల్లభజ్యోశుల శశికళకు విజ్ఞాన్ డీమ్డ్ టూ బి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. డాక్టర్ కొల్లి వెంకటకృష్ణకిషోర్ పర్యవేక్షణలో డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ అప్టిమైజ్‌డ్ ఎంసెంబల్ డీప్ లెర్నింగ్ మోడల్స్ ఫర్ అక్యూరేట్ ప్లాంట్ లీఫ్ డిసీజ్ క్లాసిఫికేషన్ అనే అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనకి డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శశికళను విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ కె.రామకృష్ణ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఈత పోటీల్లో జొన్నలగడ్డ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న గ్రామస్తులు

గుంటూరు రూరల్: ఈతల పోటీల్లో జొన్నలగడ్డకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభను చూపి పతకాలు సాధించారని గ్రామ వైస్ ప్రెసిడెంట్ నామా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గ్రామంలో ప్రతిభ చూపిన విద్యార్థి అభినందన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి కలవకొల్లు విజయరాఘవ ఇటీవల జరిగిన నగరంలోని నెక్ట్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ స్విమ్మింగ్ పూల్ పోటీలలో 6 కిలో మీటర్లు, 3 కిలో మీటర్లు ఈతల పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి పతకాలు సాధించాడన్నారు. 6 కిల్లో మీటర్లు దూరాన్ని 4 గంటలలో పూర్తిచేశాడని, ఈ ఏడాది జనవరిలో రాజమండ్రిలోని ఆత్రేయపురంలో నిర్వహించిన ఒక కిలో మీటర్ కెనాల్ స్విమ్మింగ్, 100 మీటర్లు ఫ్రీస్టల్ విభాగంలో రజిత పతకం సాధించాడన్నారు. ఫిబ్రవరిలో విజయవాడలోని ఆక్వోడెవిల్స్ క్లబ్ నిర్వహించిన 26వ కృష్ణానది క్రాసింగ్ పోటీల్లో ప్రతిభను చూపాడన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభను చూపిన విద్యార్థి రాఘవను గ్రామానికి చెందిన శ్రీవారి సేవా సమితి అధ్యక్ష్యుడ వంగా నవీన్‌రెడ్డి, ప్రజలు ఘనంగా సన్మానించారు.

క్రిస్పర్–క్యాస్9 సాంకేతికత ద్వారా కొత్త థెరపీల అభివృద్ధి


ప్రొఫెసర్ అప్పారావు వెల్లడి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అప్పారావు

చేబ్రోలు: క్రిస్పర్–క్యాస్9 సాంకేతికత ద్వారా జీనోమ్‌లో నిర్దిష్ట మార్పులు చేయడం, జన్యుపరమైన రుగ్మతలను సరిదిద్దడం, వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందడం, కొత్త థెరపీలను అభివృద్ధి చేయడంలో విస్తృతంగా ఉపయోగపడుతోందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పి.అప్పారావు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ మోలిక్యులర్ బయోలజీ అండ్ బయోటెక్నాలజీ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ ప్లాంట్ మైక్రోబియోమ్ అనేది ఒక మొక్క చుట్టూ మరియు దాని లోపల నివసించే సూక్ష్మజీవుల సమూహమని, ఈ సూక్ష్మజీవులు మొక్కల పెరుగుదల, వ్యాధి నిరోధకత, మరియు భూసార వృద్ధికి ఎంతో సహాయపడతాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిలో ప్లాంట్ మైక్రోబియోమ్‌పై పరిశోధనలు విస్తృతంగా జరుగుతున్నాయని వివరించారు. అస్పైర్–బయోనెస్ట్ డైరెక్టర్ అండ్ కోఆర్డినేటర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ హెడ్ ప్రొఫెసర్ రాజగోపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వ్యవసాయం, బయోటెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, ఔషధ పరిశ్రమ మరియు సంబంధిత రంగాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంలో ఆవిష్కర్తలను ప్రోత్సహించాలన్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ పి.కొండయ్య మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రమైన ఆరోగ్య సమస్యలలో ఒకటిగా మారిందన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ ఆగేపాటి ఎస్.రాఘవేంద్రరావు మాట్లాడుతూ మొక్కలు మన జీవితానికి పునాది మాత్రమే కాకుండా అవి మనకు ఆహారం, ఆక్సిజన్ అందించడమే కాదు, మన శాస్త్రీయ అవగాహనకు, పర్యావరణ సమతుల్యతకు, ఆర్థిక అభివృద్ధికి కీలకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

ఉచితంగా వినికిడి పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో ఉచిత వినికిడి పరీక్షల శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్.శిరీష ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. శిరీష మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు గుంటూరులోని స్నేహిల్ స్పీచ్ అండ్ హియరింగ్‌సెంటర్, పాజిటివ్ రిహాబిలిటేషన్ సెంటర్, సంజయ్ హియరింగ్ క్లీనిక్, అమరావతి స్పీచ్ అండ్ హియరింగ్‌సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. వినికిడి సమస్య ఉన్న వారు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రాథమిక దశలోనే వినికిడి సమస్యలను గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు అన్నారు. రాయితీతో కొంత మంది వినికిడి పరీక్షల శిబిరానికి వచ్చేవారికి మిషన్లు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సి.హెచ్.సుజాత, ఆడియాలజిస్టులు పి.లావణ్య, బి.క్రిస్టఫర్, రవితేజ, నిస్సీ, ఏంజెల్ పాల్గొన్నారు.